

# కాయకల్పం

... 14 ఆగస్ట్ 19[illegible]2

**బా**ర్‌లో కూర్చున్న సత్యంకి మనసంతా ఏదోలా ఉంది.

మొదటిసారిగా తాను మద్యం తీసుకోబోతున్నాడు. కానీ, ఇష్టంతో కాదు- తప్పనిసరి కాబట్టి!

తను తన తండ్రికి గుణపాఠం నేర్పబోతున్నాడు. నిజానికి తన తండ్రి తమకు అడిగిందల్లా ఇచ్చాడు. విద్యాబుద్ధులు నేర్పించాడు. తమ నింతవాళ్ళను చేశాడు. కానీ, తమకు నచ్చనిదల్లా ఆయన పగలూ, రాత్రీ తేడా లేకుండా త్రాగడం!

మొదట నెలకొకసారి ఫ్రెండ్స్‌తో త్రాగి వచ్చేవాడు.

అది క్రమంగా అలవాటుగా, వ్యసనంగా మారి ఇప్పుడతనికి అదే లోకమయిపోయింది.

తన తల్లి ఆయనను ఎంతగానో వేడుకొంది... ఈ అలవాటు మానుకొమ్మని! ఆయన వినలేదు. తనకూ పెళ్ళైంది. తన భార్య తరపు బంధువులెవరైనా ఇంటికొస్తే- ఆయన ఈ అలవాటు తనకు ఇబ్బందికరంగా తయారైంది. అన్నిట్లోనూ తలెత్తుకు తిరిగే తాను- ఈ విషయంలో అందరి ముందూ తల దించుకోవలసివస్తోంది.

తనకు పెళ్ళైన నాలుగవరోజు తన భార్య ఏడుగంటలకే గది తలుపు వేస్తూంటే అదేమిటని ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏమండీ... మీ నాన్నగారు తాగుతున్నారండీ... నాకు భయంగా వుంది!"

"అది ఆయనకు అలవాటు. నీ కెందుకు భయం?"

"మా ఇంట్లో ఇలా త్రాగేవారు లేరు కాబట్టే భయం! అయినా ఇలా ఇంట్లో ఓ త్రాగుబోతుంటే ఎలా నన్ను ధైర్యంగా మసలుకోమంటారండీ?!"

"నోర్ముయ్ః..!" ఆమె చెంప చెళ్ళుమనిపించాడు.

"నా తండ్రిని త్రాగుబోతనడానికి నీకెంత ధైర్యం?" ఆవేశంగా అన్నాడు తను.

"అవునండీ! ఆయన నట్టింట్లో అలా త్రాగుతూ కూర్చునుంటే చూసి సహిస్తారు గాని, నేను ఆయన్ని త్రాగుబోతంటే మాత్రం సహించరు. మీది త్రాగుబోతుల వంశమని ముందే తెలుసుంటే ఈ ఇంటి గడపే త్రొక్కేదాన్ని కాదు!" అని ఏడుస్తూ మంచంపై వాలిపోయింది.

తన మనసు ఎంతో బాధపడింది ఆమె మాటలకు.

తను భర్తగా ఆమెను ఎంతో అనురాగంతో చూసుకోవాలని, ఆమె తన ప్రేమని గుర్తించి గర్వపడాలని, జన్మజన్మలకు తనలాంటి భర్తనే ఆమె కోరుకోవాలని ఎంతో ఆశించాడు. కానీ, పెళ్ళైన నాల్గవరోజే తమ మధ్య అపార్థాలు!

ఆరోజు నుండి తామిద్దరి సంభాషణల్లో ఆయన ప్రస్తావన లేకుండా చూసుకునేవాడు. కానీ- తన మామగారు, అత్తగారు, బావమరదులు అందరూ ఆయన వాలకాన్ని పసిగట్టి తన ముందు వెటకారంగా మాట్లాడేవారు.

అదీగాక- స్నేహితులను కూడా తాను ఇంటికి ఆహ్వానించేవాడు కాదు. ఆయనలా హాల్లోనే బ్రాందిషాపు పెట్టుకొనివుంటే వారిని ఆహ్వానించే ధైర్యం తనకు లేదు. తను అనుకొనివుంటే ఏనాడో వేరే కాపురం పెట్టేవాడు. కాని- తల్లినీ, తోబుట్టువులనూ వదలి వెళ్ళిపోవడానికి తనకు మనసొప్పలేదు.

ఇక లాభం లేదని ప్రొద్దున మొదటిసారిగా ఆయన త్రాగుడు గురించి సంభాషణ సలిపాడు.

"నాన్నగారూ... మీరిలా రోజంతా త్రాగుతూ డబ్బును వృధాచేయడం నాకు నచ్చలేదు!"

ఆయన తనవైపు ఆశ్చర్యంగా చూశాడు... 'వీడికి ఇంత ధైర్యం ఎప్పుడు వచ్చింది?' అన్నట్లుంది ఆ చూపు.

"నేను మీ డబ్బేం త్రాగలేదుగా... నా డబ్బుతో నేను త్రాగుతున్నాను."

"కనీసం మీ ఆరోగ్యం గురించైనా త్రాగుడు మానండి నాన్నా!"

"ఏ అలవాటు లేనివాడు కూడా తపీమని గుండాగి ఛస్తున్నాడు. టైమొస్తే ఎవరైనా పోవాల్సిందే! దానికీ, దీనికీ సంబంధం లేదు."

ఇక ఆయన మాటలతో మారడని తెలిసిపోయింది. తనూ బాగా త్రాగి ఇంటికెళితే తనవల్లే తన కొడుకు ఇలా అయ్యాడన్న బాధతో ఆయన, పరివర్తన చెందుతారు. తనకా నమ్మకం ఉంది.

బేరర్ తెచ్చిపెట్టిన గాజుగ్లాసులోని ద్రవాన్ని కళ్ళు మూసుకొని త్రాగసాగాడు సత్యం.

• • •

**బార్‌**లో కూర్చొనివున్న రాఘవరావు మనసంతా బాధగా ఉంది.

ఏనాడూ తనను ప్రశ్నించని తన కొడుకు ఈరోజు తన త్రాగుడు గురించి ప్రశ్నించాడు. నిజానికి- తను వాళ్ళకేమి చేశాడు? అడిగినంత డబ్బు లివ్వడం తప్ప- వాళ్ళేమి చదువుతున్నారు, ఎలా చదువుతున్నారు... అన్నది పట్టించుకోనేలేదు.

తానిచ్చిన స్వాతంత్ర్యానికి వాడికి చెడిపోవడానికే ఎక్కువ అవకాశం ఉండేది. కాని, వాడు చక్కగా చదువుకుని, తన తోబుట్టువులనూ చదివించాడు. ఈనాడు తాను రిటైరైనా ఇంత నిశ్చింతగా ఉన్నాడంటే అది వాడి చలవే! తల్లిదండ్రులు మంచిగా ఉన్నా- పెళ్ళైన రెండోరోజే వేరేకాపురం పెడుతున్న ఈరోజుల్లో... తన ప్రవర్తన ఇంత అసభ్యంగా ఉన్నా... వాడు తన బాధ్యతను విస్మరించలేదు. ఎంతో ఓర్పుతో అన్నీ సహించాడు.

ఇక తను ఈ త్రాగుడు మానేయాలి...

ఇప్పటికే ఇంట్లో అందర్నీ తన ప్రవర్తనతో బాధపెట్టాడు... ఈరోజే తను ఆఖరిసారిగా తాగేది!

బేరర్ తెచ్చిపెట్టిన గాజుగ్లాసులోని ద్రవాన్ని ఆత్రంగా త్రాగసాగాడు రాఘవరావు.

• • •

**ఇం**టి ముందు జనం కనిపించేసరికి సగం మత్తు దిగింది రాఘవరావుకి.

జనాన్ని తోసుకొని ముందుకెళ్లి చూశాడు. రక్తపు మడుగులో ఉన్న తన పెద్దకొడుకు సత్యాన్ని చూడగానే-

"బాబూ... సత్యం!" అని బిగ్గరగా అరిచి కుప్పకూలిపోయాడు.

ప్రక్కింట్లో ఉంటున్న రాఘవరావు స్నేహితుడు మాధవయ్య- రాఘవరావుని సమీపించి "ఒరేయ్‌ః... రాఘవా! చూశావా... నీ త్రాగుడు ఎంతపని చేసిందో?! తాను తాగివస్తే నీవు త్రాగుడు మానుతావని నీ కొడుకు చేసిన చివరి ప్రయత్నం ఏమైందో చూశావా? నీ వ్యసనం నీ కొడుకు ప్రాణాల్ని లారీ రూపంలో వచ్చి బలితీసుకుంది. ఇక నిన్ను ఎవరూ అడిగేవారుండరు. పోయి తాగు... పోరా!" అన్నాడు.

"నన్ను క్షమించరా సత్యం!" అంటూ సత్యం శవంపై వాలిపోయాడు రాఘవరావు. చేర్చి ఉన్న ఆ రెండుచేతులూ "నాన్నా... నీవు త్రాగుడు మానవా?" అని అడుగుతున్నట్లే అన్పించింది రాఘవరావుకి.

"ఒరేః... సత్యం! ఇక నేను చచ్చినా తాగన్రా! నన్ను 'నాన్నా...' అని పిలవరా!" అని వెక్కివెక్కి ఏడవసాగాడు.